

మట్టి పరీక్ష..పొలానికి రక్ష

భూమిలో పోషక లోపాల నిర్ధారణకు భూసార పరీక్షలు దోహదపడతాయి. వీటి ఆధారంగా ఎరువులు వినియోగించడం మేలు. - 8లో



క్షణికావేశంతో బాలిక ఆత్మహత్య

జిల్లా కేంద్రంలో ఓ బాలిక క్షణికావేశంతో ఆత్మ హత్య చేసుకుంది. కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చింది. - 8లో

నేటి నుంచి డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని ఓల్డ్ బ్యాచ్ డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నారు. ఉమ్మడి జిల్లాలోని 11 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు 2400 మంది హాజరవుతున్నారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం పర్యవేక్షించారు.

సాక్షి
శ్రీకాకుళం
గురువారం ∣ 13 ∣ జూన్ ∣ 2024

న్యూస్‌రీల్

డీసీసీబీ చైర్మన్ రాజీనామా



సీఈఓ వరప్రసాద్‌కు రాజీనామా పత్రం అందజేస్తున్న కరిమి రాజేశ్వరరావు

పోలాకి: డీసీసీబీ చైర్మన్ పదవికి, పోలాకి పీఏసీఎస్ అధ్యక్ష పదవికి కరిమి రాజేశ్వరరావు బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా పోలాకిలోని తన నివాసం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో కీలకమైన సహకార బ్యాంక్ చైర్మన్ బాధ్యతను ఇన్నాళ్లూ అప్పగించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఇతర పెద్దల సూచనలతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. గెలుపొందిన ఎమ్మెల్యేలు, బాధ్యతలు స్వీకరించిన మంత్రులు జిల్లా అభివృద్ధికి కృషిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

డీసీఎంఎస్ చైర్మన్..



గార/ శ్రీకాకుళం అర్బన్: డీసీఎంఎస్ చైర్మన్ పదవికి గొండు కృష్ణమూర్తి బుధవారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ప్రజాతీర్పును గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. తన పదవీ కాలంలో రైతులకు ఉత్తమ సేవలందించేందుకు కృషి చేయడంతో పాటు డీసీఎంఎస్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. గొండు కృష్ణమూర్తితో పాటు పాలకవర్గ సభ్యులు కూడా రాజీనామాలు చేశారు.

ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్..



సెక్రటరీకి రాజీనామాపత్రం అందిస్తున్న చైర్మన్ బాబూరావు

కవిటి: ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు నూతలపాటి బాబూరావు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం కవిటి మండలం గొర్లెపాడులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో తన రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ సెక్రటరీ ఆంధ్రయ్యకు అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

● కింజరాపు ఫ్యామిలీకి

డబుల్ బొనాంజా

- వదవులతో పెద్దపీట వేసిన చంద్రబాబు
- కేంద్రమంత్రిగా అబ్బాయి
- రాష్ట్రమంత్రిగా బాబాయి
- సామాజిక సమీకరణాలు పక్కన పెట్టి అచ్చెన్నాయుడికి అగ్రతాంబూలం
- సీనియర్ ఎమ్మెల్యేగా కేబినెట్‌లోకి తీసుకున్న చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కింజరాపు ఫ్యామిలీ జాక్‌పాట్ కొట్టింది. అబ్బాయి రామ్మోహన్‌నాయుడికి కేంద్రమంత్రి పదవి దక్కగా.. బాబాయి అచ్చెన్నాయుడికి రాష్ట్ర మంత్రి పదవి లభించింది. మొత్తమ్మీద వెలమ సామాజిక వర్గానికే చంద్రబాబు పెద్దపీట వేశారు. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన అచ్చెన్నాయుడు సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని కేబినెట్‌లో చోటు కల్పించారు. జిల్లా నుంచి ఒకే ఒక్కరికి మంత్రి పదవి ఇచ్చారు. దీంతో మిగతా ఆశావహులంతా నిరాశకు గురి కాక తప్పలేదు.

వారి ఆశలపై నీళ్లు..

వివిధ జిల్లాల్లో ఇద్దరేసి మంత్రులను నియమించినా మన జిల్లా నుంచి ఆ చాన్స్ ఇవ్వలేదు. కూన రవికుమార్, బెందాళం అశోక్, గౌతు శిరీష ప్రధానంగా మంత్రి పదవి ఆశించినప్పటికీ వారి ఆశలపై నీళ్లు జల్లి అచ్చెన్నాయుడికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, వరుసగా మూడు సార్లు గెలిచిన నేతగా, ప్రతిపక్షంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పనిచేయడంతో సామాజిక సమీకరణాలు పక్కన పెట్టి అచ్చెన్నాయుడికి బెర్త్ కేటాయించారు. తన అన్న కుమారుడైన ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్రమంత్రి పదవి ఇవ్వడంతో అచ్చెన్నాయుడికి మంత్రి పదవి దక్కుతుందో లేదో అన్న ఉత్కంఠ మంగళవారం అర్ధరాత్రి వరకు సాగింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికే అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలోనూ మంత్రి పదవులు ఇవ్వరేమో అన్న సందేహాలుండేవి. వాటిన్నింటినీ పటాపంచలు చేసి, సామాజిక సమీకరణాలు కన్నా కింజరాపు ఫ్యామిలీతో సాన్నిహిత్యానికే చంద్రబాబు ప్రాధాన్యమిచ్చారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచారన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్రం సంబంధం లేకుండా ఒకే ఫ్యామిలీకి మంత్రి పదవులిచ్చేశారు. అచ్చెన్నాయుడు 2014–19లో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది.

హ్యాట్రిక్ విజయాలు..

టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామంలో దాలినాయుడు, కళావతమ్మ దంపతులకు 1971 మార్చి 26న అచ్చెన్నాయుడు జన్మించారు. ఏడుగురు సంతానంలో ఈయనొకరు. భార్య విజయమాధవి, పిల్లలు కృష్ణమోహన్ నాయుడు, తనూజ ఉన్నారు. డిగ్రీ విద్యార్హత గల అచ్చెన్నాయుడు తన సోదరుడు ఎర్రం నాయుడు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చి హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికయ్యారు. ఇదే నియోజకవర్గం నుంచి మూడు సార్లు విజయం సాధించగా, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత టెక్కలి నుంచి 2009లో కొర్ల రేవతీపతి చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత హ్యాట్రిక్ విజయాలు సాధించారు.



పొలిటికల్ టాక్

● దక్కని అమాత్యయోగం

కాళింగుల అంతర్మథనం

- మంత్రి వర్గంలో కాళింగ సామాజిక వర్గానికి చంద్రబాబు మొండిచేయి
- తీవ్ర ఆవేదనలో కూన రవికుమార్ అభిమానులు
- సామాజికవర్గ వాట్సాప్ గ్రూపుల్లో చర్చ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన ప్రాధాన్యతతో పోల్చుతున్న పరిస్థితి





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశించిన జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలకు నిరాశే ఎదురైంది. అచ్చెన్నాయుడితో పాటు కూన రవికుమార్, బెందాళం అశోక్, గౌతు శిరీష మంత్రి పదవి దక్కుతుందేమోనని ఆశించారు. పార్టీ విధేయత, సామాజిక వర్గ సమీకరణాల నేపథ్యంలో మంత్రి పదవి వస్తుందని భావించారు. కానీ కింజరాపు ఫ్యామిలీకే చంద్రబాబు పెద్దపీట వేశారు. దీంతో జిల్లాలో ప్రధాన కీలక సామాజిక వర్గమైన కాళింగులకు మొండిచేయి మిగిలింది. అటు కేంద్రంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడికి అవకాశమివ్వగా, ఇటు రాష్ట్రంలో అచ్చెన్నాయుడికి చోటు కల్పించడంతో మిగతా సామాజిక వర్గాలకు భంగపాటు తప్పలేదు.

కూనకు నిరాశ..

జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, పార్టీకి కష్టకాలంలో ఎదురొడ్డి పనిచేసినందుకు తప్పకుండా మంత్రి పదవి వస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ భారీగా ఆశలు పెట్టుకున్నారు. గతంలో విప్‌గా పని చేసిన అనుభవంతో ఈసారి తనకు కేబినెట్‌లో బెర్త్ ఉంటుందని భావించారు. కేంద్ర కేబినెట్‌లో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు అవకాశం ఇవ్వడంతో రాష్ట్ర కేబినెట్‌లో తప్పకుండా కాళింగులకు చోటు దక్కుతుందని, ఆ కోటాలో తనకే మంత్రి పదవి వస్తుందని ఆశించారు. అదే సామాజిక వర్గానికి చెందిన బెందాళం అశోక్ కూడా మంత్రి పదవి వస్తుందని ఊహించారు. కాళింగ సామాజికవర్గంలో ఒకరికి తప్పకుండా వస్తుందని, అది ఈ ఇద్దరిలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి వస్తుందని అంచనా వేసుకున్నారు. జిల్లాలోని కాళింగ సామాజిక వర్గీయులు కూడా పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఈసారి మంత్రి పదవి తప్పకుండా ఇవ్వాలని అధిష్టానానికి మొరపెట్టుకున్నారు. అయినా వీరి మొర వినలేదు. మంత్రివర్గంలో కాళింగులను పరిగణనలోకి తీసుకోలేదు. తనకు సన్నిహితంగా ఉన్న కింజరాపు ఫ్యామిలీకే ప్రాధాన్యమిచ్చి, మంత్రి పదవులు కట్టబెట్టారు.

కష్టం గుర్తించలేదంటూ..

జిల్లాలో టీడీపీ గెలుపునకు కాళింగ సామాజిక వర్గం పనిచేసినా, పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంలో కృషి చేసినప్పటికీ చంద్రబాబు గుర్తించకపోవడాన్ని కాళింగ సామాజిక వర్గీయులు ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్పీకర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ పదవులిస్తే ఈ ప్రభుత్వంలో కనీసం ఒక్కరికైనా మంత్రి పదవి ఇవ్వలేదని రుసరుసలాడుతున్నారు. ఈ మేరకు సామాజికవర్గ వాట్సాప్ గ్రూపుల్లో ఇదే చర్చ జరుగుతోంది. టీడీపీకి అండగా నిలిచినందుకు తగిన బహుమానం ఇచ్చారని చర్చించుకుంటున్నారు. ఇంకా ఉన్నది ఒక మంత్రి పదవి, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, విప్ పదవులే ఉన్నాయని, వాటిలో మంత్రి పదవి, స్పీకర్ పదవి వచ్చే పరిస్థితి లేదని, ఇస్తే చీఫ్ విప్, విప్ ఇచ్చి చేతులు దులుపుకుంటారేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూన రవికుమార్ వర్గీయులు మాత్రం తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈసారి తప్పనిసరిగా మంత్రి పదవి వస్తుందని మంగళవారం అర్ధరాత్రి వరకు ఎదురు చూశారు. తీరా జాబితా వచ్చాక పేరు లేకపోవడంతో డీలా పడిపోయారు. సంతృప్తి పరచడానికి ఏదో కంటి తుడుపు పోస్టు ఇచ్చి చేతులు దులుపుకొంటారని కూన వర్గీయులు భావిస్తున్నారు. ప్రాధాన్యం లేని పోస్టులిస్తే ఎవరికి ఉపయోగమని కూడా చర్చించుకుంటున్నారు. మంత్రి పదవి కేటాయించకపోవడంపై నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. అయితే, పూర్తి మెజారిటీ ఉండటంతో వీరి మొర వినే పరిస్థితిలో చంద్రబాబు లేరని కచ్చితంగా చెప్పవచ్చు. మళ్లీ మంత్రి వర్గ విస్తరణ జరిగితే అప్పుడు చూసుకోవల్సిందే తప్ప అంతవరకు అవమానకరంగానే భావించాలి. ఇక, గౌతు శిరీష పరిస్థితి కూడా అంతే. తన తండ్రి సీనియారిటీ, పార్టీకి విధేయతను దృష్టిలో ఉంచుకుని మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నా చంద్రబాబు కనీసం పరిశీలించలేదు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం నగరంలోని ఆదివారంపేటలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమన్నారు. ఆస్తులు ఎలా భద్రపరచుకుంటామో అంతకంటే ఎక్కువగా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. అందుకు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడితే నివారణ సులభమవుతుందన్నారు. అనంతరం వైద్యులు 104 మందికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్ వెంకట్, డాక్టర్ హరినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

సజావుగా ఏపీ పీజీసెట్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పీజీసెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో 166 మంది, ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో 93 మంది పరీక్ష రాశారు.



బడి గంటలు ▶ మోగే వేళ..

- నేటి నుంచి పునఃప్రారంభం కానున్న పాఠశాలలు
- ప్రభుత్వ మార్గదర్శకాల తర్వాతే స్టూడెంట్ కిట్ల పంపిణీ



శ్రీకాకుళం న్యూకాలనీ:

వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి బడులు పునఃప్రారంభం కానున్నాయి. వాస్తవానికి ఈ నెల 12నే పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉన్నా సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు అవకాశం కల్పించాల్సిందిగా ఉపాధ్యాయ సంఘాల నాయకుల వినతి మేరకు పునఃప్రారంభాన్ని ఒకరోజు వాయిదా వేశారు. జిల్లాలో మొత్తం 3053 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 2655, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు 398 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తాజాగా నిష్క్రమించిన టెన్త్‌క్లాస్ విద్యార్థులను మినహాయిస్తే 1,73,723 మంది చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 90949 మంది చదువుతున్నారు.

స్టూడెంట్ కిట్లుగా మార్పు..

విద్యార్థులకు ఉచితంగా అందజేసే జగనన్న విద్యా కానుక కిట్‌ను కూటమి ప్రభుత్వం స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చుతూ నిర్ణయం తీసుకుంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌తోపాటు మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ,బెల్టు, రెండు జతల సాక్సులు, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు ఉచితంగా అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు బ్యాగులు 1,73,723, నోట్‌బుక్స్ 11,01578 మాత్రమే వచ్చాయి. యూనిఫాం, షూ, సాక్సులు, బెల్టు, డిక్షనరీలు ఇంత వరకు రాలేదు. పాఠ్యపుస్తకాలు జిల్లాకు 14,56,326 అవసరం కాగా ఇప్పటి వరకు 5,46,401 మాత్రం వచ్చాయి. మార్గమధ్యలో 1,58,501 ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి..



ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గురువారం నుంచి బడులు పనిచేయాల్సి ఉంటుంది. విద్యార్థులు శతశాతం హాజరయ్యేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. మార్గదర్శకాల ప్రకారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తాం. పీఎం–పోషన్ గోరుముద్దను మొదటి రోజు నుంచి అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు...

టెక్కలి: గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలలో తెరుచుకోనున్న నేపథ్యంలో బుధవారం టెక్కలి నుంచి వివిధ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లను తరలించారు. మండల విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు పర్యవేక్షణలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో గల స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాలు, స్టూడెంట్ కిట్లను సరఫరా చేశారు.



టెక్కలి: బాలికోన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు పుస్తకాలను తీసుకువెళ్తున్న ఉపాధ్యాయులు



టెక్కలి: స్టాక్ పాయింట్ నుంచి స్టూడెంట్ కిట్ బ్యాగులను తీసుకువెళ్తున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల ఔదార్యం



రమేష్ భార్యకు నగదు అందజేస్తున్న సచివాలయం ఉద్యోగులు

కొత్తూరు: తోటి ఉద్యోగి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటుకున్నారు గూనభద్ర గ్రామ సచివాలయ ఉద్యోగులు. కొత్తూరు మండలం గొట్టిపల్లి గిరిజన గ్రామానికి చెందిన గొర్లె రమేష్ సచివాలయ వీఆర్వోగా పనిచేసేవాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో తోటి ఉద్యోగులు లక్ష రూపాయల విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని రమేష్ భార్యకు బుధవారం అందజేశారు.

ఆదిత్యుని సన్నిధిలో శృంగేరి పీఠాధిపతి



గంభీరం భారతి స్వామికి జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని శృంగేరి విరూపాక్ష పీఠాధిపతి గంభీరం భారతి స్వామివారు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చక బృందం, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేసారు. ఆదిత్యుని సన్నిధి ఎంతో ప్రశాంతంగా ఉందని, ఇక్కడి సూర్యనమస్కారాల పూజలతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని వివరించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి రాజశేఖర శర్మ, వేదపండితులు శ్రీనివాస శర్మ (కన్నయ్య), పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

అస్థిత్వ ఉద్యమాలే శరణ్యం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా కార్యదర్శి వెంకట్

ఆమదాలవలస: అస్థిత్వ ఉద్యమాలపై యువత మొగ్గు చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. బుధవారం చింతాడలోని ఓ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థుల విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో పాల్గొని అస్థిత్వ ఉద్యమాలపై ప్రసంగించారు. 1980 తర్వాత దేశంలో సరళీకృత ఆర్థిక విధానం ఏర్పడిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్లయినా పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేసుకోవడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ తర్వాత దేశంలో అస్థిత్వ రాజకీయాలు ఏర్పడ్డాయని, దీంతో తూర్పు యూరప్ దేశాల్లో సోషలిజం కనుమరుగైందన్నారు. కాలక్రమేణా సమాజంలో ఉన్న అస్తిత్వాన్ని ఉపయోగించుకొని రాజకీయ పార్టీలు తమకు అనుగుణంగా మార్చుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, మహిళా కన్వీనర్ పావని, జిల్లా అధ్యక్షుడు చందు, జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్, సహాయ కార్యదర్శి సంతోష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



పంటను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రకృతి విభాగం ఎన్ఎఫ్ఏ రాజా

ఆమదాలవలస : ప్రకృతి వ్యవసాయంతో అధిక పంట దిగుబడులు సాధించవచ్చునని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం ఎన్ఎఫ్ఏ రాజా అన్నారు. బుధవారం నిమ్మతొర్లాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ముందుగా రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న క్షేత్రాలను, ఏ-గ్రేడ్ మోడల్స్‌ను సందర్శించారు. రైతుల వివరాలను ఐసీఆర్‌పీ రికార్డ్స్‌లో కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. నవధాన్యాలు వేసిన రైతుల వివరాలను, సాగులో ఆచరించిన పద్ధతులను విధిగా రికార్డు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్ఎఫ్ఎస్ బాబాజీ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మీనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి పరీక్ష.. పొలానికి రక్ష



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

- భూమిలో పోషక లోపాల నిర్ధారణకు అవకాశం
- ఫలితాల ఆధారంగా ఎరువులు, పురుగుల మందుల వినియోగం
- జిల్లాలోని 656 ఆర్‌బీకేల్లో 27100 భూసార పరీక్షలు లక్ష్యం
- ఖరీఫ్‌లో 70 శాతం భూసార పరీక్షల నిర్వహణ

సబ్‌డివిజన్	మట్టి నమూనాలు
నరసన్నపేట	3759
కొత్తూరు	3396
పలాస	3931
రణస్థలం	4055
సోంపేట	3346
శ్రీకాకుళం	4291
టెక్కలి	4299

నరసన్నపేట : వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్నా.. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందాలన్నా దానికి తగ్గట్టుగా మార్గాలను అనుసరించాలి. ప్రధానంగా భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకొని వాటికి అనుగుణంగా అవసరమైన ఎరువుల వినియోగించాలి. అయితే కొందరు రైతులు అధిక దిగుబడుల పేరుతో ఇష్టారాజ్యంగా, పరిమితికి మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడేస్తున్నారు. దీంతో భూమిలో పోషక విలువలు నశిస్తున్నాయి. పంటల పెరుగుదలకు అవసరమైన నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోతోంది. చౌడు భారంతో పాటు చీడపీడల ఉద్ధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో పెరిగిన ఆధునిక సాంకేతికతను దృష్టిలో పెట్టుకొని రైతులు తమ భూముల్లో మట్టికి పరీక్షలు చేయిస్తే ఎంతో మేలు కలుగుతుంది. పొలంలో ఉన్న లోపాలు, పోషకాల వాస్తవ పరిస్థితి తెలుసుకొని ఎరువులు వాడటం ద్వారా మంచి దిగుబడులు సాధించడంతో పాటు అనవసర ఖర్చులు తగ్గుతాయి.

ఒక్కో ఆర్‌బీకే పరిధిలో 40 పరీక్షలు..

గత ఐదేళ్లుగా భూసార పరీక్షలు చేయిస్తున్న రైతుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. వ్యవసాయ అధికారులు కూడా రైతులకు వీటి ప్రయోజనాలు వివరిస్తున్నారు. 2023/24 ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఆర్‌బీకే పరిధిలో 15 చొప్పున మట్టి పరీక్షలు చేయించారు. ఈ మేరకు మట్టి నమూనాలు సేకరించారు. 2024/25 ఆర్థిక సంవత్సరంలో ప్రతీ ఆర్‌బీకే పరిధిలో 40 పరీక్షలు చేయాలని జిల్లా వ్యాప్తంగా 656 ఆర్‌బీకేల్లో 27100 పరీక్షలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఖరీఫ్‌లోనే 70 శాతం మేర 18970 నమూనాలు సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవిలో పంటలు లేని సమయంలో మట్టి నమూనాలు తీయాలి. పొలాలకు సాగు నీరు పెట్టేటప్పుడు, ఎరువులు వేసిన తర్వాత మట్టి నమూనాలు సేకరించకూడదు.
- పొలంలో నీడ ఉండే ప్రదేశాలు చేలగట్టు, చెట్లున్న ప్రాంతాల్లో మట్టి నమూనాలు తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి.
- వరి పొలంలో 'వి' ఆకారంలో 15-20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపార నుంచి ఆరు అంగులాల కింద వరకూ ఒక పక్కగా మట్టి సేకరించాలి.
- వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు 8 ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అర కేజీ బరువు వచ్చేలా తీసుకొని నీడలో ఆరబెట్టాలి.
- మట్టి నమూనా ఆరిన తరువాత పాలిథిన్ కవరులో నింపి రైతుల వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపించాలి.

పోషకాల లెక్క పక్కా..

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలకు తరలించి వివిధ భౌతిక, రసాయనిక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల ఆమ్లక్షార గుణాలు, పోషకాలు స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాలను రైతులకు వివరిస్తారు. దీని ప్రకారం రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తే దిగుబడులు పెరగడమే కాకుండా భూసారం పెరుగుతుంది. రైతులకు ఖర్చు కూడా తగ్గుతుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

అవగాహన పెరిగింది..



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. గతంతో పోల్చితే రైతుల్లో కూడా అవగాహన పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 27100 పరీక్షలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా నరసన్నపేట డివిజన్‌లో 3759 పరీక్షలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి గతేడాది సేకరించిన మట్టి నమూనాల ఫలితాలు రైతులకు అందజేస్తున్నాం. వీటి ద్వారా ఎరువులు, పురుగుల మందులు వినియోగించాలని రైతులకు సూచిస్తున్నాం.

– రవీంద్రభారతి, వ్యవసాయ శాఖ ఏడీ, నరసన్నపేట

రచనలపై దృష్టి సారించాలి



మధులత రాసిన థెర్మో డైనమిక్స్ పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ రజని, రిజిస్ట్రార్ సుజాత

ఎచ్చెర్ల క్యాంపస్: బోధన సిబ్బంది రచనలపై దృష్టి పెట్టాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ నీలాపు మధులత సంపాదకీయంలో రచించిన థెర్మో డైనమిక్స్ పుస్తకాన్ని వర్సిటీలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ మెకానికల్, మెరైన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ పరిశోధన పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం వృద్ధి చెందేలా రచన చేసినట్లు వివరించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం అధ్యాపకుల సహకారంతో రచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత పాల్గొన్నారు.

వసతిగృహాల్లో స్ప్రేయింగ్ పూర్తి

పార్వతీపురంటౌన్: పాఠశాలల పునఃప్రారంభం నాటికి వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ పూర్తి కావచ్చిందని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మలేరియా కార్యాలయంలో మాట్లాడుతూ వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఏసీఎం5% దోమల మందు స్ప్రేయింగ్ చేయించామని, తద్వారా పాఠశాలలు ప్రారంభం నాటికి దోమల ప్రభావం తగ్గి విద్యార్థుల్లో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఇప్పటికే మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కొనసాగుతోందన్నారు.

క్షణికావేశంతో బాలిక ఆత్మహత్య



బొంతా అభి (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం 17 ఏళ్ల బాలిక ప్రాణాలు బలిగొంది. స్థానికులు, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం నగరంలోని మంగువారితోటలో బొంతా హేమగిరిరావు, రమణి దంపతులు ఇద్దరు కుమారులు జగదీష్, త్రినాథ్, కుమార్తె అభి(17)తో కలిసి నివసిస్తున్నారు. వీరి స్వస్థలం శ్రీకాకుళం అయినా పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో చాలా ఏళ్లు ఉండి సంవత్సరం క్రితమే ఇక్కడికి తిరిగొచ్చారు. హేమగిరిరావు అనారోగ్యంతో ఇంటిపట్టున ఉంటే.. భార్య రమణి హోటల్‌లో పనిచేస్తోంది. కుమారులిద్దరిలో ఒకరు రాగోలు జెమ్స్‌లో సెక్యూరిటీగార్డుగా, మరొకరు పండ్ల దుకాణంలో పనిచేస్తున్నారు. అభి నగరంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ సెకెండియర్ చదువుతోంది.

చిన్ననాటి నుంచే..

ఇద్దరు మగపిల్లల తర్వాత పుట్టిన ఆడపిల్ల కావడంతో అభిని చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచారు. తాను కోరింది ఇవ్వకపోతే చాలు 'అన్నీ అన్నలకే ఇస్తారంటూ' మొండిగా వాదించడడం, అతి కోపం ప్రదర్శించడం అభికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో పెద్ద అన్నయ్యతో కూర విషయంలో అభి వాగ్వాదానికి దిగింది. తల్లి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినకుండా ఆమెతోనూ వాదనకు దిగింది. కొంతసేపయ్యాక గొడవ సద్దుమణగడంతో ఎవరి దారిని వారు వెళ్లిపోయారు.

ఎలా జరిగిందంటే..

మంగళవారం రాత్రి 7:40 ప్రాంతంలో రమణి వంట చేస్తూ.. తన భర్త హేమగిరిరావుతో 'కుమార్తె అలికిడి లేదు.. ఎక్కడుందో చూడు' అని చెప్పడంతో వెతికారు. బాత్‌రూమ్ దగ్గరకొచ్చి వెతకగా పక్కన ఉన్న కిటికీ కర్టెన్ పైపునకు చున్నీతో వేలాడుతూ కుమార్తె కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ప్రాణం ఉందేమోనని కుమారులిద్దరినీ పిలవడంతో వారొచ్చి హుటాహుటిన 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. అప్పటికే అభి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌కు చేరారు. బుధవారం ఉదయం పోస్టుమార్టం చేశామని, అభి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కామేశ్వరరావు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: స్థానిక మెట్టవీధికి చెందిన గేదెల జగదీశ్వరరావు పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. టెక్కలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదీశ్వరరావు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. మందులు వాడినా తగ్గకపోవడంతో బుధవారం తన ద్విచక్రవాహనంలోని పెట్రోల్‌ను బాటిల్లోకి తీసుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

త్వరలో బీపీఈడీ, డీపీఈడీ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం చెప్పారు. స్పాట్ వాల్యుయేషన్ పూర్తి చేసి మార్కుల జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకతకు గురైన విషయం ఈ ఎన్నికల్లో కనిపించిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వాన ఎన్నికైన ఈ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టం పని దినాలను పెంచి పట్టణాలకు పనులను విస్తరింపజేయడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం, జి.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాసులు లేక పాట్లు.. బస్సులు లేక ఇక్కట్లు!



బాపూజీ కళామందిర్‌లో ఏర్పాటుచేసిన స్క్రీన్

శ్రీకాకుళం: కూటమి నేతల ప్రమాణ స్వీకారం ప్రత్యక్షంగా తిలకించేందుకు శ్రీకాకుళం జిల్లానుంచి ముఖ్యంగా జిల్లా కేంద్రం నుంచి విజయవాడ వెళ్లిన పలువురు నాయకులు ఇబ్బందులు పడ్డారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో వసతి గృహాలు ఖాళీగా లేకపోవడంతో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలోనే పడికాపులు కాశారు. పాసులు వస్తాయని సభా ప్రాంగణంలోకి వెళ్లవచ్చని భావించినా సాధ్యం కాలేదు. ప్రతి శాసనసభ్యునికి పది పాసులు మాత్రమే ఇవ్వడంతో ఎమ్మెల్యేలంతా నాయకులు, కార్యకర్తలకు సమాధానం చెప్పలేమన్న ఉద్దేశంతో సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసినట్లు తెలిసింది. దీంతో సభాప్రాంగణంలోకి వెళ్లలేక చాలా మంది నిరాశతో వెనుదిరిగారు. మరోవైపు రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అధికారులు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయించారు. అక్కడి నుంచే పార్టీ శ్రేణులు, అభిమానులు ప్రమాణ స్వీకారోత్సవం వీక్షించారు.



పాతపట్నం బస్టాండ్ వద్ద బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

పాతపట్నంలో ప్రయాణకష్టాలు..

పాతపట్నం: సీఎం చంద్రబాబునాయుడి ప్రమాణ స్వీకారానికి ఆర్టీసీ బస్సులను తరలించడంతో స్థానిక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం కాంప్లెక్స్, బస్టాండ్ నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బుధవారం గ్రామాలకు చేరేందుకు సకాలంలో ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు నరక యాతన పడ్డారు. గంటలకొద్దీ పడిగాపులు కాశారు. కొందరు అధిక డబ్బులు చెల్లించి ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. వివిధ ప్రాంతాల నుంచి పాతపట్నం కాంప్లెక్స్‌కు ప్రతిరోజు 20 నుంచి 30 వరకూ బస్సు సర్వీసులు ఉండేవి. శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, టెక్కలి, పలాస, పాలకొండ డిపోల బస్సులు బుధవారం పాతపట్నం వైపు రాలేదు.

కూటమిలో కుమ్ములాటలు

కాశీబుగ్గ :

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 17వ వార్డులో వైఎస్సార్ సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన సీనియర్ నాయకుడు.. అదే వార్డులోని టీడీపీ నాయకుడు, కూటమి నేతలతో కలిసి ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని చించివేయించడం కలకలం రేపుతున్నాయి. తొలుత ఎవరు కట్ చేశారో తెలియకపోయినా బుధవారం సోషల్‌మీడియాలో విడుదలైన వీడియోలు అసలు విషయాన్ని బయటపెట్టాయి. తన వార్డులో తన ఫొటోలు తప్పితే ఎవరి ఫొటోలు పెట్టినా ఊరుకోనని సదరు కౌన్సిలరే తన అనుచరులతో వీటిని చింపించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన అనుచరులు ఫ్లెక్సీ చింపే సన్నివేశం రికార్డు కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీలో నూతనంగా చేరి ప్రమాణ స్వీకారానికి వెళ్లిపోయి వారితో ఫొటోలకు ఫోజులు ఇస్తూ మరోవైపు దొంగచాటుగా ఫ్లెక్సీలు చింపించడం చర్చనీయాంశమైంది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కళ్యాణ్ ఫొటోలు మాత్రమే ఉంచి నాయకుడి ఫొటో చింపేయడంతో కూటమిలో కుమ్ములాట ప్రారంభమైందని పలువురు చర్చించుకుంటున్నారు.



ఫ్లెక్సీ చించివేసిన దృశ్యం

బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థినికి రూ.37 లక్షల ప్యాకేజీ



విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ బొల్లినేని భాస్కరరావు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆసుపత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థిని నిస్సీ ప్రతిభ కనబరిచింది. బ్రిటన్‌లో ఏడాదికి రూ.37 లక్షల వేతన ప్యాకేజీకి ఎంపికైంది. ఈ మేరకు బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఎస్సీ కార్డియోకేర్ టెక్నాలజీ కోర్సు పూర్తిచేసిన నిస్సీ.. ఇంటర్న్‌షిప్ కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేరింది. అందులో పనిచేస్తూ యూకేలోని నేషనల్ హెల్త్ సర్వీసెస్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికైంది. ఈమె ఎంపిక పట్ల జెమ్స్ మెడికల్ కాలేజ్ చీఫ్ మెంటార్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు అభినందించారు.

ఉద్దానం కొబ్బరి | యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

- ఆసక్తి చూపుతున్న రైతులు
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు



కొబ్బరి తోటల్లో పశువుల ఎరువు



కొబ్బరి దుక్కుల్లో వేసిన పచ్చిరొట్ట విత్తనాలు

ఇచ్ఛాపురం రూరల్: మరో కోనసీమగా పిలిచే ఉద్దానం కొబ్బరిపై ప్రకృతి కన్నెర్రజేసింది. రెండేళ్ల నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జిల్లాలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాలతో పాటు వజ్రపుకొత్తూరు, మందస, రణస్థలం, లావేరు మండలాల్లో సుమారు 17,540 ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ప్రస్తుతం హెక్టారుకు కనీసం రెండు వందల కొబ్బరి కాయలు దిగుబడి రావడం గగనంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వారం పది రోజుల్లో తేలికపాటి వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ చెబుతుండటంతో ఉద్దానం కొబ్బరి రైతులు ముందస్తుగా సమాయత్తమవుతున్నారు. శాస్త్రీయమైన ఆధునిక సేద్యం పద్ధతులవైపు మొగ్గు చూపుతున్నారు. కొబ్బరి తోటల్లో వ్యర్థపదార్థాలైన కంపోస్టు ఎరువు, పశువుల ఎరువు, మేక, గొర్రెల ఎరువులను రైతులు కొనుగోలు చేస్తూ తోటల్లో వేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ట్రక్కు ఎరువు సుమారు మూడు వేల రూపాయల వరకు ధర పలుకుతోంది. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయశాఖ అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ వంటి విత్తనాలను తొలకరి వర్షాలు కురవగానే దుక్కిలో వేసుకుంటే భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి సూక్ష్మ పోషకాలు లభ్యమతాయని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. కొబ్బరి తోటల్లో దుక్కులు చేసే ముందు చెట్టు మొదల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ఎరువులు వేసుకుంటే ప్రయోజనం ఉంటుందని అంటున్నారు. వ్యవసాయ, కొబ్బరి తోటల్లో భూసారం పెంచుకునేందుకు నల్లమట్టిని సైతం వేయడం ద్వారా పంటల దిగుబడి అధికంగా పొందవచ్చు. దీంతో భూసారం కూడా పెరుగుతుందని ఉద్యానవన, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

లాభాలు పుష్కలం..



సేంద్రియ ఎరువులను కొబ్బరి తోటల్లో వాడటం శ్రేయస్కరం. భూమిలో లభ్యమయ్యే పోషకాలు క్రమేపీ పెరిగి కొబ్బరి మొక్కలు ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తున్నాం. రైతులు వాటిని కొనుగోలు చేసి తొలకరి జల్లులు కురిసిన అనంతరం తోటల్లో జల్లుకుంటే ప్రయోజనంగా ఉంటుంది.

– పి.మాధవీలత, ఉద్యానవన శాఖాధికారి, ఇచ్ఛాపురం మండలం